సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 3 । ఆగస్టు । 2024



బదిలీ భాగ్యమేదీ..?
గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో బదిలీలు, పదోన్నతులు చేపట్టడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు.
8లో



..గంజాయి పట్టివేత
మూడు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని సారపాక పల్లె ప్రకృతి వనం వద్ద పోలీసులు పట్టుకున్నారు.
8లో

గరిష్టం / కనిష్టం
30°/ 25°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

వైభవంగా రుద్రహోమం



స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మాసశివరాత్రిని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రుద్రహోమం వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. యాగశాలలో రుద్రహోమం పూజలు జరిపారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతిపూజ రుద్రహోమం చేశారు. వేద పండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



సకినేని రాజశేఖర్

పాల్వంచ: పాల్వంచ వెంగళరావు కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సలికినేని రాజశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. ఆయన డాక్టర్ జీఆర్.ప్రియదర్శిని పర్యవేక్షణలో 'పేరెంటల్ బాండింగ్ అండ్ పర్సనాలిటీ డైమన్షన్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

వైద్యుల నియామకానికి 5 నుంచి ఇంటర్వ్యూలు



భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై స్త్రీ వైద్య నిపుణులు, అనస్థీషియన్ల నియామకానికి ఈ నెల 5నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు విద్యార్హతలు, సీనియారిటీకి సంబంధించి ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ప్రత్యక్షంగా రాలేని వారు msahbcm@gmail. com మెయిల్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. కాగా, స్త్రీ వైద్య నిపుణులకు రూ.2 లక్షలు, అనస్థీషియన్‌కు నెలకు రూ.1.50 లక్షల వేతనం అందుతుందని వెల్లడించారు.

404 అడుగులకు చేరిన కిన్నెరసాని

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి 2,700 క్యూసెక్కుల వరద నీరు కిన్నెరసాని జలాశయానికి వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లో శుక్రవారం నీటిమట్టం 404.30 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటు ఎత్తి ఉంచి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ తెలిపారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆదర్శంగా సింగరేణి

మూడేళ్లుగా ఆశాజనకమైన ఫలితాలు
- రూ.12,701 కోట్ల నెట్‌వర్త్‌తో అగ్రస్థానం
- 2022–23 సంవత్సర కాగ్ రిపోర్టులో వెల్లడి



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి.. మెరుగైన పనితీరుతో ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు ఆదర్శంగా నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశాజనకమైన ఫలితాలు సాధించింది. ట్రాన్స్‌కో సంస్థల దగ్గర పేరుకుపోయిన రూ. 23,934 కోట్ల బకాయిలు సకాలంలో వచ్చి ఉంటే మరింత ప్రగతి సాధించేది. కాగ్ వెలువరించిన రిపోర్టులో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) రిపోర్టు అంటేనే ఇటు ప్రభుత్వం అటు ప్రభుత్వ రంగ సంస్థలు గడగడలాడతాయి. ప్రజాధనంతో నడిచే సంస్థల పనితీరు ఎలా ఉంది ? పన్నుల రూపంలో ప్రజల నుంచి సేకరించిన సొమ్ములను సద్వినియోగం చేస్తున్నారా ? లేక దుర్వినియోగం చేస్తున్నారా అనే అంశాలను కాగ్ రిపోర్టు తూర్పారబడతుంది. తాజా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాగ్ రిపోర్టు వెల్లడైంది. ఈ రిపోర్టుల్లో కీలకంగా పరిగణించే రిటర్న్ ఆన్ ఈక్విటీ, రిటర్న్ ఆన్ క్యాపిట ల్ ఎంప్లాయిడ్ తదితర విభాగాల్లో సింగరేణి సానుకూల ఫలితాలు సాధించింది. ట్రాన్స్‌కో సంస్థల దగ్గర పేరుకుపోయిన రూ. 23,934 కోట్ల బకా యిలు సకాలంలో వచ్చి ఉంటే కాగ్ రిపోర్టులో సింగరేణి మరింత మెరుగైన స్థితిలో నిలిచి ఉండేదని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దక్షిణ భారతదేశంలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉండటం సింగరేణికి కలిసి వచ్చిందని నిపుణులు అంటున్నా రు. నిర్వహణ పరమైన లోపాలను సవరించుకుని, మ్యాన్‌పవర్‌ను మరింత సమర్థంగా వినియోగించుకుంటే సింగరేణికి తిరుగుండదని చెబుతున్నారు.

లాభాల ఆర్జనలో మేటి

పెట్టిన పెట్టుబడి మీద లాభాలు ఆర్జించడంలో సింగరేణి సంస్థ మెరుగైన పనితీరు కనబరుస్తోందని కాగ్ రిపోర్టు పేర్కొంది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక ఏడాదిని మించి మరో ఏడాది సానుకూల ఫలితాలు సాధిస్తోంది. 2020–21లో రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌వోఈ) 3.20 శాతం ఉండగా పన్నులు మినహాయించగా వచ్చిన లాభం రూ. 272 కోట్లుగా నమోదయింది. ఆ తర్వాత ఆర్థిక సంవత్సరం 2021–22లో ఆర్‌ఓఈ 12 శాతానికి చేరుకుని లాభాలు రూ. 1,227కు చేరుకున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఓఈ 20 శాతంగా నమోదు చేస్తూ లాభాలను రూ. 2,596 కోట్లకు కార్మికులు, యాజమాన్యం చేర్చారు. అంతేకాదు ఆడిట్ రిపోర్టులో కీలకంగా పేర్కొనే రిటర్న్ ఆన్ క్యాపిటల్ ఎంప్లాయిడ్ (ఆర్‌ఓఈ) లోనూ సింగరేణి మెరుగ్గా ఉంది. సాధారణంగా ఆర్‌ఓఈ 20 శాతం కంటే పైన ఉంటే ఆ కంపెనీ పనితీరు, ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్నట్టుగా భావిస్తారు. పెట్టిన పెట్టుబడికి మంచి లాభాలు అందిస్తున్న సంస్థగా పరిగణిస్తారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఓఈ 14 శాతమే సాధించింది. ఇందుకు కరోనా, లాక్‌డౌన్ వంటివి కారణాలుగా నిలిచాయి. కానీ ఆ తర్వాత వచ్చిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో మెరుగైన పనితీరు కనబరుస్తూ వరుసగా 24 శాతం, 34 శాతంగా ఆర్‌ఓఈని సింగరేణి నమోదు చేసింది.

కాగ్ ఇంకా ఏం చెప్పిందంటే..

- సింగరేణి 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,596 కోట్ల నెట్ ప్రాఫిట్‌ను ఆర్జించింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ.12,701 కోట్ల నెట్ వర్త్‌తో అగ్రస్థానంలో ఉంది. నేలబొగ్గును తవ్వే సింగరేణి దగ్గర రూ.10,154 కోట్ల రిజర్వ్ మనీ ఉందని ఆడిట్ రిపోర్టు పేర్కొంది.
- ప్రభుత్వ రంగ సంస్థలు 18 ఉండగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో కేవలం సింగరేణి మెరుగైన పనితీరు కనబరిచినట్టు ఆడిట్ రిపోర్ట్ పేర్కొంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఆర్ అండ్ డీ కోసం రూ.4.30 కోట్లు ఖర్చు చేయగా 2022–23లో ఈ మొత్తాన్ని రూ.5.93 కోట్లకు పెంచింది. ఆర్థిక పరిపుష్టి కలిగిన సింగరేణి నుంచి సరికొత్త ఆవిష్కరణలు రావాల్సి ఉంది. ఆ దిశగా సంస్థ ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.
- ప్రతీ ఏడాది సింగరేణి సంస్థ సకాలంలో ఆడిట్ లెక్కలను సమర్పిస్తోంది. పెండింగ్‌లు లేవు.
- సింగరేణికి భారీగా బకాయిలు పడిన ఉత్తర్ విద్యుత్ పంపిణీ, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాయి.

'స్వచ్ఛదనం–పచ్చదనం'
విజయవంతం చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మెప్మా టీఎంసీఎస్, ఎంఈఓలు, వైద్య శాఖాధికారులు, ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఐదు రోజులు నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. 5న నేపథ్యం–మన బాధ్యత, 6న నీళ్ల పట్టీద్దాం– నీరు కాపాడుదాం, 7న నేపథ్యం సరిచేద్దాం, 8న ఆరోగ్యమే మహాభాగ్యం, 9న స్వచ్ఛ కార్యాలయం/నివాసం–అందరికీ స్వాగతం కార్యక్రమాలను నిర్వహించాలని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, పశుసంవర్ధక శాఖాధికారి పురంధర్, పరిశ్రమల శాఖాధికారి తిరుపతయ్య, డీపీఓ చంద్రమౌళి, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర పాల్గొన్నారు.

'ఇన్నోవేటర్' దరఖాస్తు గడువు పొడిగింపు

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణల దరఖాస్తు గడువు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన గడువు ఈ నెల 3వ తేదీ వరకు ముగియనుండగా, మళ్లీ పొడిగించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలలో ప్రతిభ చాటేలా రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్లుగా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు తదితర విభాగాల్లో దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందని వివరించారు. ప్రదర్శన ఆవిష్కరణపై రెండు నిమిషాల నిడివి గల వీడియో, నాలుగు ఫొటోలు, ఆరు వాక్యాలతో ఆసక్తి కలిగిన ఔత్సాహికులు 91006 78543 నంబరుకు వాట్సాప్ చేయాలని, వృత్తి, ఊరిపేరు, జిల్లా పేరుతో వివరాలు పంపించాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలో దరఖాస్తుల సమాచారం క్షేత్రస్థాయి వరకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రత్యేక డిజైన్ సిమెంట్ వరల పరిశీలన



సిమెంట్ వరలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన వరలను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. చుంచుపల్లి నందాతండాలోని వరల తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. డిజైన్‌పై నిర్వాహకుడితో మాట్లాడారు. మోడల్ వర తయారు చేసి ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెంబడి, గ్రామాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలతో పాటు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఈ ప్రత్యేక సిమెంట్ వరలను వినియోగించాలనే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్ పానెం కృష్ణ, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏపీఓ ఈజీఎస్ ఎమ్.రఘుపతి, ఈసీ పిల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, భూమిక పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వైలెన్స్ బృందం పరిశీలన



పెనగడప పీహెచ్‌సీ వద్ద రాష్ట్ర సర్వైలెన్స్ బృందం

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర సర్వైలెన్స్ బృందం శుక్రవారం పెనగడప పీహెచ్‌సీని సందర్శించింది. వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా ముందస్తుగా తీసుకుంటున్న చర్యల తీరుపై ఆరా తీసింది. ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదవుతున్న వివిధ రకాలైన వ్యాధుల వివరాలు పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రామవరం, సఫాయిబస్తీ, పాత కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఆస్పత్రులను పరిశీలించారు. ఆ తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్‌ను కలిసి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎపిడమాలజిస్ట్ మోహన్ కురువ, వైద్యాధికారులు ముక్కంటేష్, రాజీవ్ ఆనంద్, పెనగడప వైద్యాధికారి నేహా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయించొద్దు

- మెనూ ప్రకారం ఆహారం అందించాలి
- ఐటీడీఏ పీఓ రాహుల్



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం/పినపాక: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులతో పనులు చేయించొద్దని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ హెచ్చరించారు. శుక్రవారం పీఓ కార్యాలయంలో ఏటీడీఓలు, పాఠశాలల ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. అనంతరం పినపాక మండలం ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాల, ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేదని, పూర్తిస్థాయిలో బోధన అందడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎంల అనుమతి లేకుండా విద్యార్థులు గృహాలకు వెళ్లడం, పరిశుభ్రతపై దృష్టి సారించకపోవడం వంటివి తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీల కారణంగా బోధన కుంటుపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. మెనూ విషయంతోపాటు పలు ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు, ఏటీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏటీడీఓలు, స్పెషల్ ఆఫీసర్లు వారానికి రెండుసార్లు పాఠశాలలను తనిఖీ చేయాలని, విద్యార్థుల మానసికస్థితి, నైపుణ్యం ఎప్పటికప్పుడు పరీక్షించాలని చెప్పారు. డార్మెటరీ, డైనింగ్ హాల్, మంచినీరు, బాలికల పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఈఈని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. పాఠశాలలోనే డార్మెటరీ, వంటగదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని, టాయిలెట్లను శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, ఏసీఎంఓ రమణయ్యతోపాటు శ్రీనివాస్, జహీరుద్దీన్, సత్యవతి, అశోక్, చంద్రమోహన్, రాధమ్మ, మంగతాయారు, హరికృష్ణ హెచ్‌ఎం ఉదయ్ కిరణ్, భానుప్రియ పాల్గొన్నారు.

త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు..

- విద్యుత్ ఎస్‌ఈ భీకంసింగ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులకు త్వరితగతిన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని విద్యుత్ ఎస్‌ఈ బి.భీకంసింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2022 డిసెంబర్ నుంచి 2023 జూలై వరకు ఎనిమిది నెలల్లో జిల్లాలో 2,344 సర్వీసులను మంజూరు చేసినట్లు తెలిపారు. గతేడాదితో పోల్చుకుంటే 264 సర్వీసులు అధికంగా మంజూరు చేశామని, 12.7 శాతం సర్వీసుల మంజూరు రేటు పెరిగిందని వివరించారు. సర్వీసుల మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్ చేయడం వల్ల జాప్యం కావడం లేదని తెలిపారు. ఈ స్టోర్స్ విధానం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకుని కావాల్సిన సమయంలో తీసుకుని పనులను ప్రారంభించడం వల్ల వెంటనే మంజూరుకు దోహదమవుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని, వంగిన స్తంభాలను, లూజ్ లైన్లను సరిచేస్తున్నామని, రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు.

బ్లాస్టింగ్‌తో భయం.. భయం

తోగ్గూడెంలో అనుమతులు లేకుండా క్వారీల నిర్వహణ
- బాంబు పేలుళ్లకు ఇళ్లపై పడుతున్న బండరాళ్లు
- ప్రకంపనాలతో సమీప గ్రామాల్లోని ఇళ్లకు బీటలు
- కొరవడిన మైనింగ్, పోలీస్ అధికారుల పర్యవేక్షణ




క్వారీలో బ్లాస్టింగ్‌కు రిగ్గింగ్ చేస్తున్న కార్మికులు (ఇన్‌సెట్) పేలుళ్ల ధాటికి బీటలువారిన గోడ

పాల్వంచరూరల్: క్వారీల బ్లాస్టింగ్‌తో సమీపంలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శక్తిమంతమైన పేలుళ్లతో బండరాళ్లు ఎగిరి ఇళ్లపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల గోడలకు బీటలు వారుతున్నాయి. మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో గిరిజనుల పేరుతో గిరిజనేతరులు క్వారీలు, క్రషర్లు నిర్వహిస్తున్నారు. మొత్తం ఏడు మెటల్ క్వారీలు ఉండగా, ఒక్క క్వారీకే మైనింగ్ శాఖ నుంచి అనుమతి ఉంది. అనుమతులు లేకున్నా బండరాళ్లను పగులగొట్టేందుకు శక్తిమంతమైన జిలెటిన్ స్టిక్స్ వినియోగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో బాంబుల మోతమోగుతోంది. కంప్రెషర్లతో బండరాళ్లకు రంధ్రాలు పెట్టి బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో బండరాళ్లు ఎగిరి సమీపంలో ఉన్న తోగ్గూడెంలోని ఇళ్లపై పడుతున్నాయి. బ్లాస్టింగ్‌తో వచ్చే ప్రకంపనాలకు సమీప గ్రామాల్లోని ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. దీంతో తోగ్గూడెం, నాగారం, జగన్నాథపురం, తోగ్గూడెంతండా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కాలుష్యం వెదజల్లుతున్న క్రషర్ మిల్లులు

తోగ్గూడెం గ్రామంలోని క్వారీలు, క్రషర్ మిల్లుల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లుతోంది. వ్యాపారులు అనధికారంగా స్టోన్ క్రషర్లు నిర్వహిస్తూ విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతూ రూ. కోట్లకు పడగలెత్తుతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం నిద్రావస్థలోనే జోగుతున్నారు. పేలుళ్ల ప్రాంతం గ్రీన్ కేటగిరీ (తక్కువ కాలుష్యం) నుంచి రెడ్ కేటగిరీలోకి(ఎక్కువ కాలుష్యం) వస్తున్నా నియంత్రణ లేదు.

పేల్చే ముందు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాల్సి ఉన్నా..

క్వారీల్లో బ్లాస్టింగ్‌కు గనుల శాఖ, పోలీసు శాఖ అనుమతులు లేవు. బ్లాస్టింగ్‌కు అనుమతులు ఇచ్చినా జిలెటిన్ స్టిక్స్, బాంబులు పేల్చే ముందు, తర్వాత పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. కానీ క్వారీ యజమానులు పట్టించుకోవడంలేదు. బాంబుల మోతతో రోజూ రాత్రి సమయంలో నిద్ర కూడా ఉండటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. క్రషర్ మిల్లుల వల్ల కాలుష్యం వెదజల్లుతోందని, క్వారీలను, క్రషర్ మిల్లులను మూసివేయాలని కోరుతూ నెలరోజుల క్రితం స్థానికులు, ఆదివాసీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రూ. 55 కోట్లు జరిమానా విధించినా..

నిబంధనలకు విరుద్ధంగా క్వారీలు నిర్వహించినట్లు గతంలో మైనింగ్‌శాఖ ఉన్నతాధికారులకు గతంలో ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు సర్వే నిర్వహించగా అనుమతించిన హద్దులు దాటి క్వారీ తవ్వకాలు చేపట్టినట్లు తేలింది. దీంతో నలుగురు నిర్వాహకులకు టన్నుకు రూ.65 చొప్పున రూ.55 కోట్ల జరిమానా విధిస్తూ నోటీసులు జారీచేశారు. కానీ ఇప్పటివరకు ఆ జరిమానా చెల్లించలేదని సమాచారం.

గతంలో మావోయిస్టులకు జిలెటిన్ స్టిక్స్ సరఫరా..

క్వారీలో అక్రమంగా బ్లాస్టింగ్ చేసేందుకు శక్తిమంతమైన జిలెటిన్ స్టిక్స్ వినియోగిస్తున్నారు. ఈ పేలుడు పదర్థాలను ఎక్కడ నుంచి తీసుకొచ్చి వినియోగిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. క్వారీలో వినియోగించే జిలెటిన్ స్టిక్స్‌ను ఇక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు సరఫరా చేసినట్లు 2019లో కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. దాడులు నిర్వహించగా, భారీ ఎత్తున శక్తిమంతమైన పేలుడు పదార్థాలు లభించాయి. దీంతో క్వారీలను సీజ్, నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొన్నాళ్ల తర్వాత అధికారులను మచ్చిక చేసుకుని మళ్లీ పేలుళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకు శక్తిమంతమైన బాంబులు దిగుమతి చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేసినా..



క్వారీల్లో నిర్వాహకులు రాత్రి, పగలు శక్తిమంతమైన బాంబులు పేల్చుతున్నారు. దీంతో పరిసర గ్రామాల్లో ఇళ్ల గోడలు, పైకప్పులు బీటలు వారుతున్నాయి. పోలీసులకు, రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

–మొదం పొట్టయ్య, తోగ్గూడెం

మా ఇల్లు బీటలు వారింది



క్వారీల్లో బాంబులతో బండరాళ్లను పగుల గొట్టడం వల్ల వైబ్రేషన్స్ వస్తున్నాయి. దీని వల్ల గ్రామంలోని ఇళ్లు బీటలు వారుతున్నాయి. మా ఇంటి పైకప్పు కూడా బీటలు వారింది. దీంతో వర్షాకాలం వర్షం వస్తే కురుస్తోంది. క్వారీలను మూసివేయాలి.

–సోయం లక్ష్మయ్య, తోగ్గూడెం

నా దృష్టికి రాలేదు..



క్వారీల్లో శక్తిమంతమైన బ్లాస్టింగ్‌కు అనుమతులు లేవు. నిర్వాహకులు అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ జరిపితే చర్యలు తీసుకుంటాం. బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు నా దృష్టికి రాలేదు.

–వినయ్‌కుమార్, సీఐ పాల్వంచ

మైనింగ్ అనుమతులు లేవు..

తోగ్గూడెంలో ఒకటి మినహా మిగతా క్వారీల నిర్వహణకు మా శాఖ ద్వారా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దొంగచాటుగా క్వారీలను నిర్వహిస్తే గతంలో కేసులు పెట్టాం. మళ్లీ క్వారీలు నిర్వహిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. చర్యలు తీసుకుంటాం.

–దినేష్, మైనింగ్ శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

దుర్గమ్మవారికి భద్రాద్రి రామయ్య సారె



ఇంద్రకీలాద్రి దేవస్థానంలో సారెతో రామాలయ ఈఓ రమాదేవి

భద్రాచలం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలోని దుర్గామల్లీశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం తరఫున సారె సమర్పించారు. ఈ సందర్భంగా భద్రాద్రి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం సారె తీసుకెళ్లగా ఇంద్రకీలాద్రి ఆలయ అధికారులు స్వాగతం పలికాక ఆలయ మర్యాదల నడుమ అమ్మవారికి సమర్పించారు. ఆ తర్వాత భద్రాచలం ఈఓ, సిబ్బందికి పండితులు వేదాశీర్వచనం, ఇంద్రకీలాద్రి ఆలయ ఈఓ కేఎస్.రామారావు అమ్మ వారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు శుక్రవారం విరాళం అందించారు. కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన వై.పిచ్చిరెడ్డి రూ.లక్ష విరాళం అందజేసి స్వామిని దర్శించుకున్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌తో 22 మంది బాలలకు విముక్తి

కొత్తగూడెంటౌన్: ఇటీవల చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌తో జిల్లాలో 22 మంది బాలకార్మికులకు విముక్తి కలిగించామని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో వెల్లడించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించామని తెలిపారు. ఐదు బృందాలుగా ఏర్పడి చేపట్టిన తనిఖీల్లో 22 మంది బాలలకు పని నుంచి విముక్తి కల్పించడమే కాక 20 మంది యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఏటీఎం మిషన్‌లో కట్లపాము



కట్లపామును చూపిస్తున్న మహేశ్

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి హెడ్డాఫీస్ సెంటర్‌లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఏటీఎంలో క్యాష్‌ను పెట్టేందుకు బ్యాంకు ఉద్యోగి మూర్తి మిషన్ తెరవడంతో డబ్బు పెట్టే అరలో పాము కనిపించింది. దీంతో మూర్తి భయాందోళతో ఏటీఎం నుంచి బయటకు వచ్చి పాములు పట్టే సిబ్బంది మహేశ్‌కు సమాచారం ఇచ్చాడు. మహేశ్ ఏటీఎం ఉన్న చోటుకు చేరుకొని పామును పట్టుకొని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు. రాత్రి సమయంలో కట్ల పాము ఏటీఎంలోకి దూరి ఉటుందని భావిస్తున్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

పాల్వంచ: బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కాలనీలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ రాఘవయ్య దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకురాలు మమతపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గుడుంబా పట్టివేత

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ బొంబాయితండాలో శుక్రవారం 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. బొంబాయితండాకు చెందిన బానోత్ మంగీలాల్ గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు తెలియడంతో ఆయన ఇంట్లో తనిఖీ చేసి గుడుంబా నిల్వలను గుర్తించినట్లు చెప్పారు. గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతోపాటు మంగీలాల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని కొమ్ముగూడెంలో పొలం దున్నే విషయమై ఇద్దరికి గొడవ జరగగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు మంగీలాల్, సక్రాం మధ్య వరి పొలాలు దుక్కి దున్నే విషయమై వివాదం నెలకొంది. గురువారం మంగీలాల్ ట్రాక్టర్ డ్రైవర్‌పై సక్రాం దాడి చేయడంతో చేయి విరిగింది. కాగా, శుక్రవారం మంగీలాల్, సక్రం బైక్‌లపై వెళ్తూ ఎదురుపడటంతో దాడి చేసుకోగా సక్రాంకు గాయాలయ్యాయి. దీంతో ఆయనను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

బదిలీ భాగ్యమేదీ..?

- స్థానచలనం కల్పించాలని సెర్ప్ ఉద్యోగుల వేడుకోలు
- పదేళ్లుగా బదిలీలకు నోచుకోని వైనం
- ఉమ్మడి జిల్లాలో 346 మంది సిబ్బంది



మహిళా సంఘాల సమావేశంలో సెర్ప్ సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియ దాదాపు నెల రోజులుగా కొనసాగుతూ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. అయితే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో మాత్రం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అమలు చేయడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి బదిలీల విషయంలో ఎలాంటి ఊసెత్తకపోవడంతో అసంతృప్తికి లోనవుతున్నారు. సెర్ప్‌లో పనిచేస్తున్న సిబ్బందికి దాదాపు పదేళ్లుగా పదోన్నతులు, స్థానచలనం కల్పించలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 346 సిబ్బంది సర్కారు తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఏళ్లుగా ఒకే కేడర్‌లో కొనసాగుతున్నారు. దీంతో కొందరు ఒకే జిల్లాలో చాలా కాలంగా పనిచేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి సెర్ప్ సిబ్బందికి పే స్కేల్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తోంది. వీరిలో ఎంఎస్‌సీసీ నుంచి డీపీఎం స్థాయి వరకు ఉద్యోగులు ఉన్నారు. దశాబ్ద కాలంగా బదిలీలకు నోచుకోని తమకందరికీ ఇకనైనా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం పలు శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు 40 శాతం చొప్పున మాత్రమే బదిలీల్లో అవకాశం కలిస్తున్న విషయం తెలిసిందే. సెర్ప్ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో యూనియన్ నాయకులు మంత్రులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో 346 మంది..

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదగడం, ఉపాధి పొందడంలో సెర్ప్ ఉద్యోగులు దాదాపు 23 ఏళ్లుగా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. సెర్ప్ పరిధిలో మినిస్టీరియల్, ఫీల్డ్ సిబ్బంది, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో – ఆర్డినేటర్లు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది క్షేత్రస్థాయిలో సేవలు అందించే సిబ్బందిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 346 మంది సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో భద్రాద్రి జిల్లాలో 163 మంది, ఖమ్మం జిల్లా పరిధిలో 183 మంది పని చేస్తున్నారు. వీరందరికీ కలిపి నెలకు రూ.1.26 కోట్ల మేర వేతనాల రూపంలో చెల్లిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో 'వెలుగు' పేరుతో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం సంస్థను కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. 2002లో ఆ ప్రాజెక్టును క్రమంగా రాష్ట్రం అంతటా విస్తరింపజేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకం పేరును ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ)గా మార్చగా, 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం (సెర్ప్)గా నామకరణం చేసింది.

2002 నుంచి కాంట్రాక్టు విధానమే..

ప్రాజెక్టు ప్రారంభమైన 2002 నుంచి ఉద్యోగులంతా కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగుతుండగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2023 ఏప్రిల్‌లో వీరి ఉద్యోగాలను క్రమబద్ధీరిస్తూ అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ ప్రక్రియలో పే స్కేల్, ఇతరత్రా వర్తింపజేసినా ఇంకా వివిధ దశల్లో అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సి ఉంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని శాఖల పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు శ్రీకారం చుట్టినా పదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగుల విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అన్ని శాఖల మాదిరిగానే తమకు కూడా పదోన్నతులతో పాటు స్థాన చలనం కల్పించాలని కోరుతున్నారు.

2.47 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- మూడు కార్లలో తరలిస్తుండుగా సారపాక వద్ద పట్టివేత
- ఆరుగురు అరెస్ట్, పరారీలో మరో ఆరుగురు
- వివరాలను వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీశ్



వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీశ్



గంజాయి, నిందితులను చూపుతున్న ఎస్‌ఐలు

బూర్గంపాడు: సారపాక పల్లె ప్రకృతి వనం వద్ద భారీగా గంజాయి పట్టుబడింది. మూడు కార్లలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలను పాల్వంచ డీఎస్పీ సతీశ్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం బూర్గంపాడు ఎస్‌ఐ రాజేశ్, సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు ప్రవీణ్, సుమన్ సారపాక పల్లెప్రకృతి వనం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వస్తున్న ఇన్నోవా(ఏపీ 26 బీఆర్ 7003), టాటా జెస్ట్ (టీఎస్ 04 ఈసీ 9740), స్విఫ్ట్ డిజైర్ (టీఎస్ 28 జె 8305) వాహనాలు పోలీసులను చూసి వెనక్కి తిప్పేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నారు. తనిఖీ చేయగా రెండు కార్లలో 2.47 క్వింటాళ్ల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.61.82లక్షలు ఉంటుందని అంచనా. స్విఫ్ట్ డిజైర్ కారు పైలట్‌గా వినియోగించారు. పోలీసులు కోనసీమ అంబేడ్కర్ జిల్లా రామచంద్రాపురానికి చెందిన కాదా తనోజ్ హర్షిత్, హైదరాబాద్‌లోని మంగళహాట్‌కు చెందిన కిషన్‌కుమార్‌దాస్, జనగాం జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన భుక్యా దేవేందర్, బూర్గంపాడు మండలం సారపాక గాంధీనగర్‌కు చెందిన రావులపల్లి ప్రతాప్, బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరుకు చెందిన ములగాడ అన్వేశ్, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన బావికాడ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. సారపాకకు చెందిన దుగ్గెంపూడి శివశంకర్‌రెడ్డిని గంజాయి అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడిగా గుర్తించారు. శివశంకర్‌రెడ్డి సీలేరు ప్రాంతం నుంచి కిల్లొ మోహన్, పోటేరు మోహన్‌రావు, రామారావు నుంచి గంజాయిని సేకరించి హైదరాబాద్‌లోని మహేందర్‌సింగ్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు వెళ్తున్నట్లు విచారణలో తేలింది. కొంతకాలంగా చింతూరు, డొంకరాయి, సీలేరు నుంచి గంజాయిని సేకరించి హైదరాబాద్, ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు వారు అంగీకరించారు. జనగామకు చెందిన లతీఫ్ గంజాయి అక్రమ రవాణాకు కార్లు ఏర్పాటు చేశాడని, గంజాయితో పాటు మూడు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.8,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న సారపాకకు చెందిన శివశంకర్‌రెడ్డి, హైదరాబాద్ ధూల్‌పేటకు చెందిన మహేందర్ సింగ్, ఏటీబీ ఏజెన్సీలోని మంగపాడుకు చెందిన కిల్లొ మోహన్, మల్కనగిరి జిల్లా చిత్రకొండకు చెందిన పోటేరు మోహన్‌రావు, ఒడిశాలోని బచలూరుకు చెందిన రామారావు, జనగామకు చెందిన లతీఫ్ కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. శివశంకర్‌రెడ్డిపై ఇప్పటికే 10 గంజాయి కేసులున్నాయని తేలిందని, కిషన్‌కుమార్‌దాస్‌పై రెండు కేసులు, తనోజ్ హర్షిత్, మునగాడ అన్వేశ్‌పై కూడా కేసులున్నట్లు తేలిందని ఆయన చెప్పారు. పాల్వంచ సీఐ వినయ్, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు రాజేశ్, సుమన్, ప్రవీణ్, నాగభిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో 9.76 కేజీలు..

భద్రాచలంఅర్బన్: ఓ మహిళ వద్ద నుంచి 9.76 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. శుక్రవారం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హన్సికా జోషి 9.76కేజీల గంజాయి సంచిలో పెట్టుకుని వెళ్తూ పట్టుబడింది. గంజాయిని ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నంలో దొరికిపోయిందని ఎక్సైజ్ సీఐ లావణ్య వెల్లడించారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు నరేందర్, విజయ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ నెహ్రూనగర్ చెందిన నార్లపాటి నరేశ్‌కు అదే గ్రామానికి చెందిన ఉషారాణితో పన్నెండేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కాగా, కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా ఉషారాణి పిల్లలతో సహా పుట్టింట్లోనే ఉంటుంది. గత నెల 31వ తేదీ రాత్రి భార్య ఉషారాణి ఇంటి ప్రహరీ ఎక్కి నరేశ్ చూస్తుండగా, గమనించిన అత్తయ్య కుమారి దొంగగా భావించి కేకలు పెట్టింది. చుట్టుపక్కల వారు రావడంతో అవమానంగా భావించిన నరేశ్ అత్తయ్య కుమారిపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి



వెంకటనారాయణ (ఫైల్)

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన రైతు పొట్రు వెంకట నారాయణ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. వెంకటనారాయణ గురువారం ఉదయం పొలం పనుల కోసం వెళ్లి తిరిగి రాలేదు. ఆయన సోదరుడు సత్యనారాయణ పోలీసులను ఆశ్రయించగా.. వారు గాలింపు చేపట్టడంతో బెండాలపాడు గ్రామ శివారు రైల్వేట్రాక్ వద్ద శవమై కనిపించాడు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. పొలం పనుల తరవాత ఇంటికి వచ్చే క్రమంలో గుండెపోటు వచ్చి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వాణి, ఇద్దరు కుమారులున్నారు.

చికిత్స పొందుతున్న కార్మికుడి భార్య...

మణుగూరుటౌన్: మండలంలోని ముత్యాలమ్మనగర్ వద్ద కారు ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమై కార్మికుడు తన భార్య గాయాలపాలైన విషయం విదితమే. ఓసీ–2లోని ఎస్అండ్‌డీ విభాగంలో మోటార్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.రామ్మోహన్ తన భార్య జ్యోత్స్నరాణితో మణుగూరు నుంచి పీవీకాలనీకి హనుమాన్ ఆలయం మీదుగా వెళ్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా కారు దగ్ధమైంది. దీంతో తీవ్రగాయాలపాలైన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న రామ్మోహన్ సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించగా, శుక్రవారం ఉదయం జ్యోత్స్నరాణి ప్రాణాలు కోల్పోయింది.

జ్వరంతో మహిళ...

కొణిజర్ల: కొణిజర్ల మండలం లక్ష్మీపురానికి చెందిన ధరావత్ సక్రి(65) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. వారం క్రితం ఆమెకు జ్వరం రావడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇంతలోనే శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. కాగా, సక్రి డెంగీ లక్షణాలతోనే మృతి చెందగా, వైద్యాధికారులు గుర్తించ లేదని కుటుంబీకులు ఆరోపించారు. గ్రామంలో దోమల బెడదపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇదేవిషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ సక్రికి సాధారణ జ్వరం రావడంతో చికిత్స తీసుకున్నట్లుగా సమాచారం ఉందని చెప్పారు. గ్రామంలో గత నెల 30న వైద్య శిబిరం నిర్వహించి పలువురి రక్తనమూనాలు సేకరించినా జ్వర లక్షణాలు బయటపడలేదని తెలిపారు.

గోదావరిలో మహిళ మృతదేహం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలోని గోదావరిలో ఓ మహిళ మృతదేహం కొట్టుకువచ్చినట్టు తెలిసింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వస్తున్న వరదలో సుమారు 50 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహం కొట్టుకొచ్చినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తమారేడుబాక గ్రామానికి చెందిన రైతు తామ కన్నయ్యకు చెందిన రెండు పశువులు విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాయి. కన్నయ్యకు చెందిన పశువులు పక్కనే ఉన్న నర్సాపురం గ్రామంలో మేత కోసం వెళ్లాయి. గ్రామంలోని విద్యుత్ లైన్‌పై చెట్టు పడటంతో అవి తెగి కిందపడ్డాయి. మేత కోసం అటువైపు వెళ్లిన ఆవు, ఎద్దు తీగలపై కాలు వేయడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని కన్నయ్య కన్నీటిపర్యంతమయ్యాడు.

యువకుడి ఆత్మహత్య

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన జోగ దేవేందర్ (26) శుక్రవారం పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు నెలల కిందట గుండాల మండలం శెట్టుపల్లి గ్రామానికి చెందిన నిర్మలదేవిని దేవేందర్ ప్రేమించి పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. భార్యకు జ్వరం రావడంతో రెండు రోజుల కిందట ఆమెను తల్లిగారింటికి చేర్చాడు. శుక్రవారం ఉదయం భార్యను చూసి వస్తానని చెప్పి ఎల్లాపురం నుంచి బయలుదేరిన దేవేందర్ సాయంత్రం వేళలో తాను పురుగులమందు తాగానని మండలంలోని పోలారం గ్రామానికి చెందిన తన స్నేహితులకు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే స్పందించిన స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ దేవేందర్ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు కొమరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొడుకు మృతితో తల్లిదండ్రులు పాపమ్మ, చినబాబు రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. దేవేందర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

జూలూరుపాడు: అక్రమంగా తరలిస్తున్న సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలానికి చెందిన వ్యాపారి కాకర్ల గ్రామంలో బొలేరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తీసుకొచ్చి లారీలో లోడు చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ, బొలేరో వాహనాన్ని సీజ్ చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పాల్వంచరూరల్: మండలంలోని ఇల్లెందులపాడుతండాలోని కిరాణా దుకాణంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూ.3,600 విలువ కలిగిన నిషేధిత గుట్కాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వ్యాపారి తేజావత్ విజయపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: గుట్టుచప్పుడుకాకుండా పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మండలంలోని పూసుగూడెం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందగా దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.2,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, ఘటనపై కేసు నమోదు చేసి, దార్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాంకు తప్పిదంతో రుణమాఫీకి దూరం



బ్యాంక్ ఖాతా రద్దయినట్లు చూపిస్తున్న దృశ్యం

ఇల్లెందు: మండలంలోని రాఘబోయినగూడెం పంచాయతీ పరిధి మొట్లగూడెంనకు చెందిన రైతు గడిపర్తి వెంకటరామారావు బ్యాంకర్ల తప్పిదంతో రుణమాఫీ నగదు కోల్పోయాడు. ఆయన ఇల్లెందు డీసీసీబీలో రూ.1.06 లక్షల రుణం తీసుకోగా.. మొదటి, రెండు విడతల్లోనూ మాఫీ కాలేదు. ఈ విషయమై బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌ను ఆరా తీశాడు. అయితే, ఏటా వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకునే క్రమంలో గత మార్చిలో ఆయన ఖాతాను సిబ్బంది రద్దు చేసి కొత్త ఖాతా తెరిచినట్లు తేలింది. దీంతో కొత్తగా రుణం తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాగా, పాత ఖాతా నంబర్‌తో రుణమాఫీ మొత్తం మంజూరైనా ఆ ఖాతా మనుగడలో లేకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని గుర్తించారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని వెంకటరామారావు కోరాడు.

ఆశ్రమ పాఠశాలలో ఏటీడీఓ విచారణ

అశ్వారావుపేటరూరల్: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి ని అదృశ్యం, ఆచూకీ లభ్యం ఘటనపై శుక్రవారం దమ్మపేట ఏటీడీఓ చంద్రమోహన్ విచారణ నిర్వహించారు. మండల కేంద్రంలోని అటెండర్స్ కాలనీలోగల ఐటీడీఏ గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని గత నెల 31వ తేదీన అదృశ్యం కాగా, అదే రోజు మధ్యాహ్నం ఏపీలోని చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలోగల అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించి పోలీసులకు అప్పగించారు. కాగా, ఈ ఘటనపై దమ్మపేట ఏటీడీఓ స్థానిక ఆశ్రమ పాఠశాలలో విచారణ చేసి, హెచ్‌ఎం సునీత వివరణను రాతపూర్వకంగా సేకరించారు. తోటి విద్యార్థులు, సిబ్బందిని విచారించారు. దీనిపై ఏటీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థిని అదృశ్యంపై విచారణ చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. అయితే, విచారణ విషయం తెలుసుకుని కొందరు జర్నలిస్టులు పాఠశాల వద్దకు వెళ్లగా లోపలికి అనుమతించలేదు. దీంతో ఏటీడీఓ విచారణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణను తూతూమంత్రంగా నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది.

తెరుచుకోని పాతలింగాల ప్రభుత్వ పాఠశాల



వరండాలో కూర్చున్న విద్యార్థులు

కామేపల్లి: విద్యావ్యవస్థ బలోపేతానిక రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుండగా.. కొందరు ఉపాధ్యాయుల తీరుతో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొంటున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలోని మండలంలోని పాతలింగాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఉపాధ్యాయులు పూనెం దీప, సామ్రాజ్యం రాలేదు. దీంతో విద్యార్థులు వరండాలోనే మధ్యాహ్నం వరకు కూర్చుని వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎంను అడిగేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. దీంతో ఉపాధ్యాయులే ఆరా తీయగా దీప సెలవు పెట్టానని పెట్టానని చెప్పగా.. సామ్రాజ్యం విధులకు వచ్చానని చెప్పడం గమనార్హం.

5న సింగరేణి పరిరక్షణ యాత్ర ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు బావుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన యాత్ర ఈనెల 5న కొత్తగూడెంలో ముగుస్తుందని తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించే సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్‌ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కాగా, శ్రావణపల్లి బొగ్గు గని వేలాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నట్లు చెబుతున్నా ఇంధన వనరుల శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొనడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఏటా రూ.6 లక్షల కోట్ల వార్షిక ఆదాయంతో పాటు లాభాల్లో నడుస్తున్న సింగరేణి సంస్థను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్రం విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్ పాల్గొన్నారు.

జీసీసీ బురదమయం



జీసీసీ కార్యాలయంలో చదును చేస్తున్న దృశ్యం



బురదలోనే లోడింగ్ కోసం ఉన్న లారీలు

ఇల్లెందు: పట్టణంలోని జీసీసీ ఆవరణ అంతా బురదమయంగా మారింది. లారీలు రావడం, లోడింగ్ అన్‌లోడింగ్ వల్ల బురదలో బియ్యం పడి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో నాగళ్లు, డోజర్‌తో దున్ని చదును చేశారు. 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు కార్యాలయం ఆవరణ అంతా బురదమయంగా మారింది. మోకాళ్లలోతు నీటిలో వాహనాల రాకపోకల వల్ల బురద ఎక్కువైంది. బురదలోనే హమాలీలు లోపలికి వచ్చిన వాహనాల్లో లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తున్నారు. ఇక్కడ పని చేసే ఉద్యోగులు కార్యాలయంలోకి వెళ్లటం, డ్యూటీ ముగించుకొని బయటకు రావటం కూడా కష్టంగా మారింది. దీంతో శుక్రవారం డోజర్ పెట్టి చదును చేశారు. ఇకనైనా కార్యాలయ ఆవరణలో వాహనాల రోకపోకల కోసం సీసీ ప్లాట్ ఫాం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి దంపతులకు గాయాలు



దంపతులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో గ్యాస్‌సిలిండర్ పేలి వృద్ధ దంపతులకు గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బూరుగు వెంకటనర్సమ్మ తన భర్త నరసింహకు టీ కాచేందుకు ఇంటి తలుపులు తీసి లోపలికి ప్రవేశించి, అగ్గిపుల్ల గీయగానే మంటలు చెలరేగాయి. ఆమె బయటకు వచ్చేలోపే పెద్దశబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలిపోయి, దంపతులకు గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఉదయం వంట చేసిన వెంకటనర్సమ్మ గ్యాస్ ఆఫ్ చేయడం మరిచిపోయిందా? లేదా గ్యాస్ సిలిండర్ లీక్ అయిఉంటుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, దంపతులిద్దరూ ప్రాణపాయం నుంచి బయటపడ్డారు.